సిద్దెంకి యాదగిరి కవిత

మాతొవ్వ

దరువ్వ ప్రచురణలు

MAA THOVVA

Poems by
Siddenky Yadagiri

Cover Design: **Akbar**

First Edition: **March 2008**

Copies: **500**

Price: **Rs. 35/-**

Publication:
Daruvu Prachuranalu

For Copies:
Siddenky Punya
W/o. Yadagiri
Vil: Gonepally, Mdl: Chinnakodur
Dist: Medak. 502 267.
Cell : 9441244773, 9441679937.
and
All Book shopes

Composed by;
Sunny Xerox
Medak Road, Siddipet.
Ph: 08457 226908.

Printed at:

Vipla Computer Services
(Designers & Multicolour Offset Printers)
Nallakunta, Hyderabad-500 044, A.P.
Ph. 27654003, 27677078, 27676910

నా మాట

వేల సంవత్సరాల చరిత్ర ఈ రోజు ఏ ఒక్కరి సొత్తు కాదు. కొందరిని చరిత్ర మరిపిస్తే తప్ప ఇపుడు మెరుస్తున్న చరిత్ర నిజమైతది లేదంటే పచ్చి బూటకమైతది. తరం నుండి మరో తరానికి మంచి చెడులను అందించినదే చరిత్ర. అలా అందించడానికి ఆసరగా తొడ్పడినదే కళ. కళలన్ని మనుషుల మనసుల్లో జానపద బాణీలై యక్షగాన వీధినాటక భాగవత రూపంలో గూడుకట్టుకున్నై కళలు. సింధు, దక్కలి, బైండ్ల, శారదకాండ్రవారి గుండెల్లో గంతులు ఏసింది. ఈ నడుమ పాశ్చాత్య సంగీత దాటికి, బహుళజాతి కంపెనీల పోటికి కూటికి లెకుంట అయి కూలవడుతున్నట్లు కుంటుతున్నయ్. పోగొట్టుకున్న కాడ లెంకులాడితే పోగొట్టుకున్నదేదో దొరికిచ్చుకుంటం.మన చరిత్రను మనకు గాకుంట చేసిన మనువాద చరిత్రను మన కళలతో కడిగేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉత్పత్తి కులాలు ఇప్పటివరకున్నదంత ఇంతకు ముందు వరకు ఉన్నదంత నేర్సుకున్నది పాట మాటతోనే, అంధకారాన్ని పారదొలెతందుకు మనిషిని మనిషిగా సూడని నాగరికత సంస్కృతి సంప్రదాయ దురాచారాలపై సంస్కరణ బాణాలను ఎక్కుపెట్టినది గౌతమ బుద్దుడు, పూలే, కబీర్, అన్నమయ్య, వేమన, పోతులూరి వీరబ్రహేంద్ర స్వామి, అంబేద్కర్ మొదలగు వారెందరో జగమెరిగిన జ్యోతులు. సామాజిక న్యాయం కోసం, సమూల మార్పు కోసం తమ బతుకులు దారవొసారు. వారి వారసత్వం పుచ్చుకొని సామాజిక సృహతో, సమానత్వం కోసం కైతలతో, కథలతో, పాటలతో వారి సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోతున్న పెద్దలకు నమస్కారాలు.

నేను సాహిత్యపు మట్టిలో ఆడుతున్న సంటిపోరన్ని దొరికినంత దోసిట్లో తీసి, అనుభవాలనే అక్షరాలను అందినంత పట్టుకొని నున్నటి జాగల పోసి అనుభూతుల్లో ఆత్మీయతను నింపి అలుకు ముగ్గు ఏసినట్లుగా ఆరాటంతో రాసిన కైతలు ఆకిట్లకు తెస్తున్న. పాఠకులారా.. తప్పులుంటే తప్పక దిద్దండి.నేను కవిత్వం రాయడంలో సామాజిక పరిస్థితుల ప్రభావం నామీద ఎంతో వుంది. మా అవ్వ – ఉన్నంతల నూనెవెట్టి నున్నగ దూసి బడికి పంపింది. తొవ్వొంటి పోతుంటే “ముట్టుడు” (అంటరానితనం) అనే ముండ్లు గుచ్చుకొన్నయ్, అరేయ్ “గా మాదిగొల్ల పోరన్ని దూరముంచుండ్రి” అని అన్నప్పటికి ఎక్కువోల్ల దోస్తులు నన్ను దూరంగొట్టక, సదువుతోపాటు నన్ను దగ్గరికి తీసుకున్నరు. అట్లా నాకు అంటరానితనమనే శత్రువును సదువుతోటే జయించాలనుకునే ఆశకల్గింది. ఇబ్బందులతోటే ఇంటర్ సురువైంది. కాలేజికి వచ్చేతందుకు పాసు తియ్యక ముందు పైసలు లేక సైకిల్ కు రానుపోను 30 కి.మీ దూరం వెళ్ళాను. కిరాయి రూంల కోసం అడిగినపుడు మాలమాదిగోల్లకు యియ్యమంటే తప్పుడు మాటలు సెప్పి తలదాసుకొన్నం.ఆ

అనుభావాలే ఇలా రాయడానికి పురికొల్పినది. నేను రాసే కవితలల్ల నా చుట్టుఉన్న పరిస్థితులు కనబడుతుంటాయి. ఉదా॥ 'పయిలం' కవితలో "నీదేందో నువు సదువుకో" –నాయిన బాధ "బిడ్డా యాల్లకు దిను, అవ్వబాధ "ముగ్గురున్న కాడ ముచ్చట పెట్టకు నలుగురున్నకాడ నవ్వకు" –నాయినమ్మ "నువ్వు ఎక్కడున్న ఫలానోని మనువని పేరు దేవోయ్" అనే తాత మాటలు సదువుకోను పోతున్న సగటు తెలంగాణ విద్యార్థి అనుభవమే ఆ విధంగా రాయడానికి పురికొల్పిన వారే అసలైన కవులు కళాకారులు ఐతే గత జీవితంలో గల బాధలు, బోధలను పక్కన పెట్టి పురాతన జానపద బాణీలను సినిమాలో వస్తేనే ఎంతో పాపులర్ అయ్యేకంటె ముందు ప్రజల నాలుకల్లో ఉన్నయ్ అటువంటి వాటిని కాగితం మీద రాయల్సిన బాధ్యత మనదే నని నా అభిప్రాయం. ఇంటర్ సదివెటపుడు ఒంటరిగానే ఉన్నా పాటలతోటి, మాటలతోటి ఎల్లయ్యకు నాకు, ఇంకొంత మందికి దొస్తాన సురువైంది. గా దొస్తానతోటే అందరం కలిసి **'దరువు'** కళాబృందంగా ఏర్పడినం.అప్పటినుండి రకరకాల కార్యక్రమాలతో నడిసి పోతున్నం.

ఈ నా పుస్తకము "మాతౌవ్వ" రాయడానికి దాదాపు 10 సంవత్సరాల కాలం పట్టింది. ఈ పుస్తకం 2004 డిసెంబర్ 20న ఠాగూర్ ఆడిటోరియం, ఉస్మానియా యూనివర్సిటి క్యాంపస్‌లో నిర్వహించిన దరువు 5వ వార్షికోత్సవము– **"దరువు జాతర"**లో ప్రజాయుద్ధ నౌక గద్దర్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. అనివార్య కారణాల వల్ల ఆలస్యమైనా ఇప్పటికీ అక్షర రూపం దాల్చింది. ఇందులో మా అవ్వ సిద్దెంకి లచ్చవ్వ, మా నాయిన సిద్దెంకి రాజయ్య, మా నాయినమ్మ సిద్దెంకి మల్లవ్వ, మా తాత సిద్దెంకి గాలయ్య గారి ప్రభావం ఎంతో వుంది. కన్న కొడుకులా కష్టసుఖాల్లో ధైర్యం చేప్పే మా మేనత్త శ్రీమతి ముంద్రాయి గోనవ్వ మామ ముంద్రాయి నర్సయ్య గారికి, సదువుతున్నప్పటి నుండి నేటి వరకు ఎంతో తోడ్పాటు అందించిన స్నేహితులు, శ్రేయోభిలాషులు నన్ను తమ మునివెళ్లతో స్పృశించిన ఉపాధ్యాయులు. ఉపన్యాసకులకు, ఆచార్యులకు, ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర ప్రజాశక్తి, తెలంగాణ సోయి.... మొదలగు పత్రికా సంపాదకులకు విమర్శలతో ప్రోత్సహించిన కందాళై రాఘవాచార్య, జింబో, డా॥ కడియాల రామ్మోహన్ రావు, ప్రొ॥ కిషన్‌రావు, ప్రొ॥ యస్‌వి.సత్యనారాయణ, డా॥ చింతల యాదయ్య, డా॥ కేశవులు, అనునిత్యం ప్రోత్సహించే గురువులు శ్రీ నందిని సిధారెడ్డి, శ్రీ గొపాల్‌రెడ్డి గార్లకు కృతజ్ఞతలు. మొదటినుండి ఎంతో సహకారం అందిస్తున్న కూర రఘోత్తంరెడ్డి గారికి, కూర జయపాల్‌రెడ్డి, కూర రామ్మోహన్‌రెడ్డి, కూర మాణిక్యరెడ్డి గార్లకు లింగంపల్లి యాదగిరి బిఎస్‌పి, బోగిబాబు ఆసపాల్, అన్నయ్య గజ్జెల కనకరాజు తెలుగు పండిత్, గుర్రాల శ్రీనివాస్ మాదిగ చింతల మల్లేశం, సి.పి.ఎం గార్లకు కృతజ్ఞతలు.



ముంద్రాయి గోనవ్వ నర్సయ్య గారు

నా పుస్తకం కోసం ఎంతగానో పరితపించి, నిశితంగా పరిశీలించిన దరువు వ్యవస్థాపక అధ్యక్షులు గుండె దరువు ఎల్లన్న గారికి, దరువు రాష్ట్ర అధ్యక్షులు రాయపోలు అంజన్నకు మరియు డా॥ పృథ్వీరాజ్, అగ్గడి బాస్కర్, కుంట శ్రీను, దమ్మని రామ్‌లక్ష్మణ్, మేడి రమణ, నౌండ్ల మహేందర్, మేక కనకయ్య, అట్లాగే మా దరువు సురువైనకాన్నుండి మాతో ఆడి – పాడిన మిత్రులందరికి... మా దరువుకు, ఈ పుస్తకం రావడానికి తోడ్పాటునందించిన జికెఎ. కృష్ణన్నకు, పెరక నర్సింలు, హెల్ప్‌లైన్ టీచర్స్ అసోసియేషన్ సిద్దిపేట వారికి, బామ్‌సెఫ్ – బిఎస్‌పి సిద్దిపేట వారికి, అన్ని ఉపాధ్యాయ సంఘాల వారికి, మాదిగ ఉపకులాల సంక్షేమ సంఘం సిద్దిపేట వారికి, డా॥ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం గోనెపల్లి మండలం చిన్నకోడూర్ మెదక్ జిల్లా వారికి, బంధుమిత్రులందరికి, ఎస్.ఎమ్.హెచ్ సిద్దిపేట హాస్టల్ విద్యార్థి మిత్రులకు, అన్వేషి హైద్రాబాద్ వారికి, ఉస్మానియ యూనివర్సిటి కాంపస్ మిత్రులకు. కౌన్సిలర్ అఖ్తర్ గారికి, సర్పంచ్ కోనేటి సత్యం గారికి, అన్నయ్యలు బాల్‌రాజు, యాదయ్య, సింగపాక మల్లేశ్ గార్లకు, అక్క లక్ష్మీరాములు గారికి నా యొక్క దన్యవాధాలు. ఆలోచన రేకెత్తించేటట్లు కవర్ డిజైన్ చెసిన అక్బర్ గారికి, డిటిపి చెసిన సన్ని జిరాక్స్ వారికి, ఈ పుస్తకాన్ని ముద్రించిన విప్ల కంప్యూటర్ సర్వీసెస్ అధినేత శ్రీ ఎం. విజయసేనారెడ్డి గారికి కృతజ్ఞతలు. నేను రాసిన వాటిని మొదట వింటు నా జీవితంలో అన్నింటిలో సగం తానైన సహచరణి శ్రీమతి సిద్దెంకి పుణ్య (లావణ్య) కి, మా ఇద్దరి అనురాగంలో ఉద్భవించిన ఆణిముత్యం నాని కి హృదయపూర్వక ఆశీస్సులు.

నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థ నిర్మూలనకై నిరంతరం పరితపించే నన్ను, మా దరువు ఆరాటాన్ని ఈ పుస్తకం ద్వారా కవిత్వం రూపంలో తీసుకొస్తున్న నాఆలోచనలని మీ మనస్పూర్తిగా ఆశీర్వాదిస్తూ... మరింత ప్రోత్సహిస్తారని ఆశిస్తూ....

మీ....

– సిద్దెంకి యాదగిరి



అంకితం

నలుగుట్ల నా కొడుకు
తెలివోడు అయితె
నా సంపాదనంత వాడే అని
తుర్తిపడే మా అవ్వ
సిద్దెంకి లచ్చవ్వ కు

నా ఒక్క కొడుకు
నాలెక్క పని జెయ్యొద్దు
వాడు నాకంటె మంచిగ బతుకాలని
బండికొడుతూ పెద్దెడ్ల అని పేరు తెచ్చుకొని
తన బతుకు దారపోసిన మా నాయిన
సిద్దెంకి రాజయ్య కు

ఈ 'మాతొవ్వ' పుస్తకం **అంకితం.**

విషయ సూచిక

నా పోరాటమే నా సందేశం

కులాల కుళ్లుతో
మతాల యిల్లైన ఈ భారతం
అహంకారం ఒల్లంత అలుముకొని
తరతరాల సంప్రదాయము ఒల్లంతా పులుముకొన్నది

మానవుడే మహనీయుడని
దేవుడు లేడని చెప్పే మార్క్సిస్టునేతలు
సిద్ధాంతం పూసుకొని ఎర్రగా వికసిస్తూ
దేవుడి పేరెందుకు పెట్టుకోవాలి

బ్యాలెట్‌కన్న బుల్లెట్ బెస్టని
సాయధ పోరాటం ఆయుధం పడితే
సిద్ధాంతానికి నెత్తురద్దిన అన్నల్లో
అగ్రవర్గ నేతలెంతమంది?

ఖర్మపేరుతో ధర్మం
అస్పృశ్యతను కొనసాగిస్తూ
సమానత్వం లేని మతపిచ్చి తీర్థంపుచ్చుకొని
మనమంత ఒక్కటనే అర్థం
మనుషుల్లో ఎక్కడుంది

బోధించు!
"కులం పునాదుల మీద
జాతిని నీతిని నిర్మించలేం"
"రాజ్యాధికారం లేకుండా
దళితుల సమస్యలు పరిష్కారంగావు"

సమీకరించు!!
“అన్ని రకాల గుత్తాధికారాలను వ్యతిరేకించేది
నా దేశభక్తి”
“నా ప్రజలే ఈ దేశంలో నిజమైన సోషలిజాన్ని స్థాపిస్తారు”
పోరాడు!!!
‘మా పోరాటం సంపద కోసం
స్వాతంత్ర్యం కోసం’
ఎందుకంటె
‘జాతీయ విప్లవ విజయానికి ఆర్థిక కారణాలకన్న
సామాజిక కారణాలే ముఖ్యం’
అందుకే
“నా పోరాటమే నా సందేశం”
కులాల కంపు – మతాల మత్తు
కమ్యూనిస్టు పార్టీల్లో కమ్యూనిటీల గుంపు
సోషలిజానికి పేరులో పొంచివున్న ప్రమాదానికి
అసలైన మందు
అంబేద్కర్ సిద్ధాంతం

27-9-2003

లందబతుకులు

తలగమిట్ల బోసిబుక్కల తొ్ౖరముసలవ్వ
ఆయాప చెట్టుకు ఈ గుంజకు మధ్య
ఎర్రగా శియ్యల తోరణంపైన
ఎగురుతున్న కాకులపై ఎల్తకట్టె పట్టుకొని షల్తిగా కూసున్న
గున్కపువ్వొలె నెత్తినడిసిన మా.. నాయినవ్వ ... మల్లవ్వ

ఆమిల్లు గరుసుకుంట బక్కపలుస
పనిరౌతుపై కిర్రుచెప్పులను ముడుస్తూ
మర్రేసి మర్రేసి గూటం గుద్దుతున్న
బొక్కలుదేలిన బక్కపల్సటి ముసలయ్య
గాయనే ... గాలయ్య....మాతాత

అటువైపు తాటాకు తీస్తే
కంపు కొట్టె లందగోలెంలకేలి
తోలు తీసి రోకలి పైనేసి
కత్తితో సాపుచేస్తున్నది మా అయ్య... రాజయ్య

ఒత్తేసిన కమ్మల్ని
ఈతముండ్లు గుచ్చుకుంట
ఇగురంతోటి నారచీరుతున్న...
మా... అవ్వ.... లచ్చవ్వ

కాల్సిన తున్కను
కరకర నలుముకుంట
తాతసుట్టు గుండాలు సుడుతున్న
లాగులేని సంటిపోరన్ని....నా యాదిల నేను
మాదిగిండ్లల్ల మాదే పెత్తనం
ఉల్లెకెళితే గంజిలీగలమై గతిమల్లోల్లమై

గెదర్ వాసనకొట్టె లందబతుకులు మాయి
దొరపెండ్లికి, పటేలు లగ్గానికి
కానుగాకు పందిరినుంచి
పొయిల కట్టెలు పోగుచేయడం దాక
వడ్లుదంచుడు, బియ్యం చేసుడు
దప్పు కొట్టుకుంట ఎగురడం
అన్నిటికి ముందట ఎనకా మేమే

శబ్బాస్‌రా 'మా'దిగోడా అన్నపాపానికి
బండిపయ్య మీదేసుకొని
దూపైందని నీళ్లడిగితే
దయగల్ల ఎక్కువోళ్లు తంబులేరుడబ్బతో నీళ్లుపోస్తే తాగింది మేమే

ఓ వైపు నిన్నటి పాసన్నం
మొన్నటి దప్పుడం శారు
మురుసుకుంటు ములుక్కుంటు తిన్నది... మేమే

మీ ఊడిగం జేయడం కోసం
ఉన్నబతుకుల్ని ధారవోసినం
తినెతందుకు బతుకుతలేం
బతుకెతందుకు ఇంత గంజిల ఉప్పేసుకొని తాగితే
గుల్లుడెందుకు?

అయ్యా!
అంబేద్కర్ బాటలో
మేం ఎదగడం సురువైంది ఇపుడే...
జాగర్త...
మీరుజాగర్త ...!
మీ సాంప్రదాయాలు జాగర్త...!!

04-12-1998

మేం భూసంబంధీకులం

మేం భూసంబంధీకులం
మేం పుట్టిపెరిగి పెద్దైంది ఈ భూమిలోనె
ఈ భూమినే సాగుజేసి
పొట్టకు బట్టకు బతికిస్తూ బతుకుతున్నాం
ఈ భూమి మనకు తల్లి తర్వాత తల్లి

మట్టిని సాగుచేసి మెట్టపొలాలన్ని దున్నే మనల్ని
మట్టి మనుషులన్నా తప్పులేదు
ఈ మట్టితోనే జీవనాధారం
ఈ మట్టితోనే జీవితం
ఈ మట్టి మన జీవితాంతం ఒగ జీవగర్ర
మట్టి మన బతుకు
మన బతుకే మట్టైనపుడు మనకు తప్పులేదు

నాగలిగట్టి పొలం దున్నుతుంటే
మన ఊపిరి సాగుచేయబడే బురుదలెక్క
పొంగిపొర్లుతుంది
మనం పీల్చేది మట్టిశ్వాస
మనం తినే తిండికి కట్టెబట్టకు
మట్టి అవసరమైనపుడు
మనల్ని మట్టి మనుషులన్నా వట్టి మనుషులన్నా
మనకు సిన్నతనంగాదు

సద్దుల గంపల్ని ఎత్తుకొని
ఒడ్డుమీద పోతుంటే
గాలికి ఊగే వరిసేను
శిరసొంచి దండం పెట్టుందామెకు

మట్టి శ్రమతో జీవం పోసింది జీవితాన్నిచ్చింది ఆమెగనుక
మనల్ని మట్టి సాకిరికి బదులు
ఎట్టిసాకిరి అని ఎక్కిరించినా మనకేంగాదు.
మనమట్టి శ్రమేలేకుంటే
వాడుతినే తిండి, కట్టెబట్ట ఎక్కడివి
ఈ మట్టిశ్వాసతోనే వాడు
ఈ మట్టిలోని మహోన్నత శిఖరాల్నందుకొని
వాడు మనల్ని దండించి ఖండించి
నిలిచేదంతా ఈ మట్టిపైనే

మనకేంగాదు. మనకేంగాదు
మనం పుట్టింది. ఈ మట్టిలోనే
సచ్చేది... ఈ మట్టిలోనే
మనల్ని .. మట్టివాల్లనీ.. ఎట్టివాల్లనీ..
ఎక్కిరించినా.. ఎలేసినా..
అఖర్కి...
పానంబోయెనాడన్న తెల్సుకోకపోతడా....
గీ మట్టి విలువేందో?

20-11-1998

మాట

మాట
మనసు పూదోట

మాట
అంతరంగంలో
జాలువారే భావాల ఊట
మదిలో ఒకటి
బయట మరొకటి వ్యక్తీకరిస్తే మాత్రం
అది కపటాల మూట
కటువుల బాట

మాట మనసును పంచి
మానవత్వాన్ని పెంచి
మార్గము చూపుతుంది

మాట
మభ్యపెడుతుంది లాభపెడుతుంది

మాట మరుగున పడివున్న
ఎతలనే కథలను
ఎద ఎదకీ ఏడుపు మాటలతో
ఎర్కచేస్తుంది.

మాట
మత్తును చల్లి
గమ్మత్తుని వెదజల్లి
మోసం చేస్తుంది.

మాటల
తూటాలు పేలుతూ
మదమలు కదుపుతాయి
మహాప్రస్థానమై
మానవత్వాన్ని కాల్చుకుతినే
నరరూప రాక్షసుల్ని
నలిపేవరకు నరికే వరకు
మాటలు తూటాలై పెలుతనే ఉంటయ్

03-08-1999

దరువు

దరువులేని పాట గుంపులేని దండోర
దురువు లేని ఆట ఎరువులేని పంట
ఆట పాటల అందం
దరువును విడదీయని బంధం
విడదీస్తె అలిగిపోయె ఆట విలపించు పాట
దరువులేని నృత్యం ధీరలేంది సత్యం
దరువు అంటూంది
నేను లేని పెళ్లి మబ్బుల్లో జాబిల్లి
నేనుండగా మీ పండుగా జరుగునిండుగా

మూగపోయిన గజ్జెలు మురిసిపోవును
చిందులేస్తూ శిగము వచ్చును
చావుకైనా పెళ్లికైన దరువు లేంది దండుగ

ఏ కార్యమైన దరువుతో కాంతినింపి
కదులుతుంది ప్రగతివైపు క్రమముగాను
దరువులేని పరువు ఎక్కడని దరువు ప్రశ్నిస్తుంది

అందుకే మేమంటున్నాం
మా పరువును దరువుకు అంకితం జేసి
మా పరువుతోని దరువును ధగ ధగ లాడిస్తాం

(దరువు కళా బృందం ప్రారంభోత్సవం మరియు ప్రథమ
వార్షికోత్సవము సందర్భంగా .....)

20-12-1999

అయ్యో కరెంటు

పెరిగిన ధర పేలిన తూట
కాలుతున్న మంటలు జాలువారుతున్న నెత్తుటికాల్వ
నింగికెగసిన జనం ఘోష

ఇన్నాళ్లు కరెంటు ముట్టుకుంటె జనం సచ్చేది
ముట్టకున్న చార్జీలను నిలదీస్తేచాలు
పొలిటికల్ పవర్‌తో ధరపెరిగిన కరెంటు
జనం చావుకు అరెస్టు వారెంట్ జారీచేస్తుంది

గొంతెత్తి నినదించిన యువకులపై
రక్షణ ఆన ముంచెత్తిన రాళ్లవాన
మరణంతో పోరాడుతూ ఒక పాణం
చార్జీ.... తగ్గించాలి చార్జీ... తగ్గించాలి
అన్న గావుకేక సావుకేకగా మారింది

ఆత్మీయుల కన్నీటి వర్షం
బల్లితెరపై చూస్తే గుండె తరుక్కుపోతూ
కండపోత వర్షం కండ్లలనుంచి కురుస్తుంది
అయ్యో కరెంట్ దయలేదే

స్వచ్ఛమైనదానవే కరెంటు
స్వార్థపరులు చేతుల్లో చిక్కి
నీనీతి నీటమునిగింది గదే

నినదించే జనప్రళయం
పిడికిలెతితే ఉడుకురక్తం ఉప్పెనైతది
కరెంటా!

ఒకసారి వెనక్కి చరిత్రచూడు
ఉద్యమాలు రాజ్యాలను రద్దు చేస్తాయి
ఈ కరెంటు పవరోలెక్క
విజయం ఖాయం ఒరిగిన వీరుల సాక్షిగా...

(ఛలోఅసెంబ్లి 28-08-2000 నాడు కాంగ్రేసు వామపక్షాలు
నిర్వహించిన ర్యాలీలో మరణించినందుకు స్పందించి)

28-08-2000

మరువని ప్రేమ

ఇల్లు బయలుదేరిన నాతో
నీ కండ్లనిండా
మత్తడిదుంకుతున్న దుఃఖాన్ని
కొన కొంగుతో ఆపుతున్న అవ్వా?
ఎంతసేపు వొలపోత్తవే ...,
ఎగతట్టి ఏడిసినా కన్నీళ్లు రావాయె...,

నీ గంజి మెతుకుల తండ్లాటలో
నీ ఆకలి మంటల కడుపులో
మాంసపు ముద్దలతో పెంచి
జన్మనిచ్చి జీవం పోసిన నీకు
జన్మజన్మల రుణపడి ఉంటనే...,

నేను మొలకై పాలుతాగుతున్నపుడు
నల్లపూసల్ని నిమిరి నీ బొచ్చెలో కొట్టినపుడు
బొచ్చెకద్దుకొని ముద్దులిచ్చుకుంట మురిసిపోతివి...,

ఊగే ఊయలలో పండుకోకబోతే
నీ గుండె మీదికెక్కించుకొని
సందమామను రమ్మంటు
జోకొడుతూ పాట వాడితివి...,

సదువుకు బసెక్కిపోంగ
తూట్లు పడ్డ బసుటికెట్టై జేబులోంచి రాలినప్పుడు
సేను సేనుకు రాల్సిన నీ సెమటసుక్కలు...యాదికొచ్చె...,

నా దొక్క కొరకు ఒక్కతీరుగ ఒలపోత్తున్నవ్
నీ పిడికెడు గుండెలో రంది పెట్టుకున్నవ్
పసందైన హాస్టల్ బువ్వలో
అవ్వా... నీ ప్రేమలేదే?

అవ్వా!
యెన్నెల రాతిరిలల్లో యెచ్చటి గోరుమద్దల్ని మరువలేదు
వొచ్చిరాని మాటలపుడు సెప్పిన బుద్ధి
"అరచేయిల కూరబెడితే ఆర్నెల్లు యాదిఉండాలంటివి"
ఎట్ల మరుత్తనే
నీ శ్రమనెట్ల మరుత్త...,
నీ ప్రేమనెట్ల మరుత్త....,

01-08-2002

స్నేహపు తొవ్వ

తొవ్వలో
నడిచే అడుగుల సవ్వడిలో
కాబోయె ప్రగతి దివ్వెలు
స్నేహమనే రెండడుగులు

జీవితం
ఒగ అనంత ప్రయాణం
కష్టాల్ని దాటి నష్టాన్ని లెక్కచేయక
రెండడుగులతో మొదలైన స్నేహం
యేసె అడుగులెన్నిటికో ఆదర్శం

జీవనం
ఓ కడలి కెరటం
సడలిపోయె జీవితానికి
భవిష్యమార్గం చూపి
ఎద బాధల్ని తీసి
సదా తోడుండేది స్నేహం

నడిచే దారిలో
కాలు జారితే కష్టమెలాగో
స్నేహమనే అడుగుజారితే
విరిగిన కాలుతో నడిచే జీవితంతో గంతే...,

నాతో స్నేహం చేయదలిచావా
కసాయితనాన్ని కాలవెట్టు

మట్టిని ప్రేమించు, మట్టిని మోసే తట్టను ప్రేమించు
తిండిని ప్రేమించినట్లె కాలెకడుపును ప్రేమించు
వస్త్రాన్ని ప్రేమించినట్లె అల్లికదారాన్ని ప్రేమించు
ఇండ్లని ప్రేమించినట్లె నిర్మించిన శ్రమను ప్రేమించు
కలాన్ని ప్రేమించినట్లే హలాన్ని ప్రేమించు
లక్షల్ని ప్రేమించినట్లె అక్షరాల్ని ప్రేమించు
మనిషిని ప్రేమించినట్లే మనసుని ప్రేమించు
అందాన్ని ప్రేమించినట్లే అంతరంగాన్ని ప్రేమించు
నిన్ను ప్రేమించినట్లే నీ పొరుగువాన్ని ప్రేమించు

హలో!
స్నేహమే చరిత్రవుతున్న ఈ శుభవేళ
Shake hand please

07-08-2002
7-50 రాత్రి

సెమట సదువులు

హాస్టల్ల ....
బువ్వ కలుపుతూ మెతుకుల్ని జూస్తే
ఒకపారి అయ్యవ్వ యాదికొచ్చి
మతిల కుతికొట్టు కుంటది
బుక్కపెట్టుకోంగ వాళ్లదొక్కలు యాదికొచ్చి

ఉప్పిడీ ఉపాసముండి
పిడికెడు ఓరకు వెట్టి
నా కడుపు జూసింద్రని
కడుపుల ఆత్మ కండ్లకు దుఃఖం దెస్తది

గ్లాసుతో నీరు దారెత్తి తాగుతుంటె
పూటగడవని కన్నీళ్లు
మాపటాకలి తీర్చిన మంచినీళ్లు గుర్తొస్తయ్
పాయసం జూస్తె పిండిపాషమనిపించె
చపాతి జూస్తె జొన్నరొట్టె యాదికొచ్చె

టిఫిన్ అయినంక ఛాయ్‌తాగుతుంటే
ఉడుకు గంజిల ఉప్పేసుకొని
ఊదుకుంట తాగిన ఆనందం
మరిసిన నాలుకకు సుర్రున కాలితే తప్ప యాదిరాలె

జెండావందనం నాడుబోంది వెడితే
అడవిల కంకులు, కాయలు కాల్చి దెచ్చిన 'అయ్య'
మంగలం పెంకల ప్యాలాలు ఏంచిన 'అవ్వ'
అంగిజేవుల వోసిన 'నాయినవ్వ'
బుక్కసా... బుక్కుమనే మా 'తాత' మాటలు

చెవులు మరిసనా కండ్లు మరువలేదు
ఇంత జదివినమని
నిన్నీయ్యాల్ల ఇస్త్రీ బట్టలు తొడుగుతూ
పుట్టిపెరిగింది ఒట్టిగనే మరుస్తమా?
ఒడిపిన శమటటో సదివిన మనం
వారి అలసట దీర్స
ఈ సదువునేగాదు
మన జీవితాల్నే అంకితం జేద్దాం
వారి రుణం దీర్చుకుందాం
వాళ్లకలల్ని నిజం చేద్దాం

(క్యాంపస్ ఆవరణలోకి వచ్చినంక యింటి గురుతులు యాదికొచ్చి, ఆర్ట్స్ కాలేజి 'ప్రజ్ఞ' మ్యాగ్జిన్ 2002 లో ప్రచురితం)

11-09-2002

మా సంతతి గాపాడ్తం

ఇన్నొద్దులు
కడుపు తిప్పలకు దప్పు దరువేసినం
బతుకుతున్నందుకు సాటింపుజేసినం
చితికిన బతుకుబాటలో దప్పు దరువేస్తున్నం
బతుకు దెబ్బ గొడ్తున్నం
ఎపుడెట్ల బతుకు దరువేయాలో
మా దప్పుకెరుకే
ఎందుకంటె బతుకుదెబ్బ గొట్టి సరుకువెడ్తది

మాదెబ్బ పాణం దీయది
కొట్టకుండానే కొట్టి మదంతీస్తది
మంచి మనసు దెస్తది
రంకెలేస్తు దుంకిపోయిన కోడెనడుగు
గూటందెబ్బలు వాటం జూసి గుద్దినయ్
నరం తెగింది సరం తెగింది
సెప్పినట్టు యింటది సేతులుంటది

గుత్పలు వట్టుకొని
పండుగకు పబ్బానికి ముందునడిసినం
గడిసుట్టు కావలిగాసినం
గుత్పలతోటి మా బతుకుల్ని గొడితే
మీ గడి బతుకు చిత్పల్‌జేస్తం
మా గుత్పకు మిమ్ముల కంటె
మమ్మల్ని కాపాడటం తెలువదా?

చూస్తే ముక్కుమూసుకునే కంపుదియ్యాలని
పందుల్ని గాసినం వాసనలేకుంటజేసినం

పందులేవద్దని పందులకు మందువెడితే
పంది జచ్చినా మెదడువాపు దెచ్చి కొన్ని రోజులు బతుకతది
గా పందులకున్న రేషం లేక కంపుకొట్టినం
రేషం తెచ్చుకున్నం రోషం పెంచుకున్నం
మా జోలికొచ్చావో
నీ పీనుగు తోలు గద్దలు పీక్కతినకుండా కంపుకొడ్తది సూడు

ఊరూరు తిరిగి ఉప్పమ్మినం
కాని మాబతుకే సప్పగైంది
సప్పగైన బతుకులో ఉప్పేసి
ఉప్పమ్మినట్టు అమ్ముతం
ఉప్పు పుట్టకుంట జేస్తం
కూరల ఉప్పు ఎక్కువైతే యిసమౌతుంది
ఇగ మీ బతుక్కూడా

సెట్టు సేమ కొట్టి అడవినరికి
సెమటొడిపి పొలం జేసినం
ఇపుడు పొలం దున్నద్దంటె
మట్టినమ్ముకున్న సేతులు వట్టిగెట్లూకుంటయ్
ఇప్పుడు సెట్లనేగాదు మోసాల్ని నరకడానికి
తయారుగున్నయ్ తయారుగుంటయ్

ఎందుకంటె
మా ఉనికిని గుర్తించక నీరుగారిస్తే
మీ బతుకు ఛిల్లులు వడ్డ కుండవుతది

***

దప్పుగొడ్తం
వాటం జూస్తం గూటం గుద్దుతం
గుత్పలందుకొంటం గడిబతుకు చిత్పల్‌జేస్తం

అడవితల్లి సాక్షిగా తుడుం గొడ్తం
నంగారమోగిస్తం బంజారపాడుతం
మమ్ముల కొట్టజూసె తుడుంఖాన్లను మట్టి గలుపుతం
బొందవెడ్తం బోర్లేస్తం ఈలవేస్తం రేలవాడుతం
తరతరాలు మీనరాల్లో వారుతున్న
సంప్రదాయ రక్తం దీస్తం
మమ్మల్ని మేం గాపాడుకుంటం
మాసంతటినంత గాపాడుతం
సందువోకుండ గాపాడుకుంటం

17-09-2002
ఉ॥ 4-30

పుల్కాషితనం

మా పుల్కాషితనాన్ని జూసి
సౌటగాల్లనుకుంటె పొరపాటె
శిలక్కొయ్యకు వేలాడిన దప్పుకూడా పుల్కాషే
జబ్బకెక్కిందా ఊరు ఊరంత లొల్లిగావాలె
మోసం చేసే గుండెల్ గుల్ల గావాలె

23-04-2003

నిరుద్యోగి పరితాపం

దేహం నిండా డిగ్రీల డ్రెస్సుతో
అరిగిన చెప్పులతో రోడ్డును కొలుస్తూ
తలపండిన జ్ఞానం గోడుకు వేలాడుతూ
అందినట్లే అందకపోయిన అవకాశం
నిరాశతో కుర్చికొరిగిన నిరుద్యోగి పరితాపం
నిత్యాన్వేషణ...........,

29-08-2002

యిత్తునాలు

అందరం యిత్తునాలకే నిలబడ్డం
శానసేపయింది
యిత్తునాలు దొరుకయని పుకారెల్లింది
పబ్లీకంత పర్శాన్ల వడ్డది తొక్కులాట షురువైంది

సర్కారోల్లు పోలీసులకు పోన్‌జేసిరి
రానెవొచ్చిరి పోలీసోల్లు వొచ్చినోళ్లు ఒట్టిగుంటరా.....?
ఉరికిటోల్ల గెదుముకుంట గొట్టిరి
బస్టాండ్ల ఊరికి పోదామని నిలబడ్డ ఎల్లయ్యను యిడిసిపెట్టరైరి
పోన్‌ల మాట్లాడెటైనను యివుతలకి గుంజి
అంగిలాగు యిడిపించి లాటితోటి ఆడించిరి

ఓరి దేవుడో... భగవంతుడా! నీకేం అన్యాలం జేసినం?
వానలు కొట్టాలని కప్పతల్లి ఆడలేదా?
జలకుండలు వోసి బోనాలు జేయలేదా?
నాలుగు సినుకులు వడితే దుక్కిసాగితిమి
యిత్తునాలేమోగని యీపులు పలిగే లడాయిపుట్టె లాటీలిరిగె

తప్పేవందో గని తిప్పలు తప్పకపాయె
మట్టి నమ్ముకున్నోల్లం పోలీసు దెబ్బలుగిట్లుంటె
పొలం దున్నం యిత్తునాలెయ్యం యిగబతుకం

ఎల్లయ్యకు గోలిదిగె నెత్తురు తడిసి ముద్దకొచ్చె
పట్నమేసుక పోయిరి దావకాన్ల షేరీక్‌జేసిరి
మంతిరి వోయి ఎల్లయ్యకు ఏం ఫికర్‌లేదనే
ముఖ్యమంతిరి వయికోర్టు జడ్సితోటి యిసారిస్తమనె

మొన్న – కాల్దారి కాల్పులు
నిన్న – చిన్నగంజాంపేట ఉప్పురైతులు
యియ్యాల్ల – సేవెల్ల రైతులు బతుకులకు తుపాకులే సావు రాయవట్టె

బక్క రైతు సస్తే వంద మంది పుట్టరు కాని
ఉద్యమం పుడ్తది జాగర్త

(రంగారెడ్డి జిల్లా చేవెళ్ల గ్రామంలో జరిగిన యిత్తునాల గొడవను
పత్రికల్లో చదివి...)

జూలై- 2003

రయమవుతున్న రైతు

గుండెల్ల కెలికే అప్పుల బాధ ఎతల వానగా మారి
కంటి కొలుకుల్ల నుంచి మొకమ్మీద కురుస్తది
ఏడిసిన మొకం ఎర్రగ తడిసి పెకాలిచ్చి కర్రైగైతే
ఇందెలు పడ్డ నిందెలతోటి నెత్తురంత పేరుకపోయి
తెల్లటి కండ్లల్ల ఎర్రడాలు మొగులైతది

ఇజ్జతికాని మాటలకు రైతు కుమిలి
కడుపులకు కసికెడు నీళ్లుపోక దొక్కగుంజుకపోయి
రందికి రయమై బతుక్కుసగమై
చర్మం చీకిపోయి ముడుతలు పడ్తది
మిత్తికట్టుమని అప్పులు ఆకిట్ల తిట్లదండుకాలు సద్వుతయ్
బతుకు మీద ఆశల్లేని బూతు మాటలు తిడ్తయ్
మందుకు మాసిపోని మాటల ముండ్లను నాటుతయ్
రైతుకు బతుకే కష్టమనిపిస్తది

సిత్రమేమిటంటే
పంటను కరాబుచేసే పురుగులకు మందుకొట్టి పాణదీసిండు
తనను కరాబుచేసే పురుగుల్నించి తప్పించుకోలేక
తానే పురుగుమందు తాగి పాణమిడిసిండు
ఇంట్లోల్లకు అప్పులబాధలతోటి ఆయన బాధైతడు
శవాన్ని పొడుచుకుతినే అప్పుల గద్దలు భూమిని అమ్ముతైం
అప్పుడు ఇల్లు-బజారు ఒక్కటైతది

సచ్చిపోతున్న రైతన్నలను బతికించుకొకపోతే
భాధలు పడుతున్న రైతుల గుండెల్ల గాథలురాస్తడు
అప్పులు మీద బతుకే సర్కారు బతుకు రైతుకు ఎర్కైతది
ఇగ మట్టిపిసికి తన తలరాత రాసుకుంటడు

రైతన్నా! సావుసమస్యలకు పరిష్కారమైతే
భూమ్మీద ఏ ఒక్కడూ మిగలడు
భూమి అంచులవరకు బతికేది బతికించేది నువ్వే
అందరిని బతికిస్తూ నువ్వు బతుకు

10-08-2004

మాతొవ్వ మేం నడుస్తం

మతిల కటీల్లం యిప్పరాకుండ తిప్పలపెడితే
కిర్రుచెప్పులు తయారుచేసే మాబతుకు చెప్పరాకుంటైంది
ముడిసినమని మురిసెనమో లేదో ముడుసుల మీద తంతే
నోరుమూసుకొని దగ్గరికి ముడుసుకున్నం
ఎవలకుచెప్పినా ఫలమేం లేదని మాదే తప్పనుకున్నం

ఎతలు ఎల్లిపారుతూ మనసు కుత కుత ఉడికితే
ఎగిలివారంగా మోటగొట్టిన ఏతంబొక్కెన పాట ఏంచెప్పుతది
జాలువారిన సెమట సుక్కల పంట
కడుపుల ఆకలి మంటలు లేపితే
పోరగండ్లకు గంజిపోసి కన్నీళ్లు మింగినం
మాయితనం జేస్తే మమ్ముల ముంచింద్రని
గాయికి ఎత్తుకొని కోపానికి రాక కొట్లాటకు పోలేదు
ఒర్రె పేగులకి బిర్రుగ ఉరిపెట్టి గోడకు ఒరిగి కూసుండి
సల్ల సెమటలు పుట్టంగా
మానెత్తురు పాలుతాపి బతికిచ్చుకున్నం

ఎగురుకుంటు దుఃఖాన్ని దిగమింగినం
వొంతుకు వరిగంజి తాగి
గజ్జెకట్టి గంతేసిన దెబ్బకు గొంతొస్తదా
జబ్బకు దప్పు చెతుల సిర్రన సిటికె
ఈలవేస్తూ కంటితో అందుకున్న రూపాయిలోటు
నోసటితో ఏరుకున్న ఆటానబిల్ల
ముట్టుడైన పుల్కాశితనమ్ముందు
పనికిరానిదైనందుకు యిషంపెట్టుకొని
యిమరస జేయలేదు

లంచం తీసుకొనే లపూట్ల మాటలు మాకు చేతకాదు
మా బతుకులు యింతే అనుకున్నం యింకొగని తెరువువోలె

నారచీరి తాళ్లు పేనినం–సావుకు దప్పేకాదు దినాలకు మైలలు తీస్తున్నం
సచ్చిన పశువుల తోలుతీసే కులధర్మం చేసిన పాపం
బతికున్న మమ్ముల పశువులకంటె ఇజ్జతి హీనంతీసి ఏళనగా ఎక్కిరించింది
ఊల్లెకు పోతె కంపువాసన కొట్టె లందబతుకులు మాయే

చెప్పరాకుండ తిడితే పడ్డం–చెప్పుతో తంతె పడ్డం
మెతుకులు దోచుకుంటె వడ్డం బుక్క ఎత్తకొడితె పడ్డం
ఎక్కిరిస్తె వడ్డం ఏళనజేస్తె వడ్డం.....
మా మంచితనాన్ని ముంచాలనుకొంటె ఎట్లా వడుతం
మాపనితనం, పనికిరానిదంటే ఎట్లూకుంటం.

దుమ్ముదులుపుతం ఎద్దుకొమ్ముల మిగ్గదీస్తం
కత్తి ఆరె నూరుతం కిందినుంచి కోసి తిత్తి తీస్తం
గుత్తులకు గుత్తులే పీకుతం
దొబ్బలు కోసి కార్జాలు గుంజి తస్సలు కోస్తం
నుల్క దండెమ్మీద తున్కలు ఆరేస్తం
మాతొవ్వ మేం నడుస్తం
మా వొల్ల నడిపించుకుంటం

10-11-2004

ఎద్దు ఏడిసిన యెవుసం

మెతుకులు దొరకని కరువుల
కడుపు మాడి పోతూంటే
బతుకు వాడి పోతుంది

ముదిరిన ఎండల కష్టం జేస్తే
కండకరిగి నెత్తురు నీళ్లై పెయంత పారితె
పంట చేతికి వచ్చేముందు ఎండిన చేనుతో
కంట నీరే పండిన పంటైంది

నోట్లెకు యేల్లు పోని బతుకులకు
రోమరోమాన తూట్లు పడ్తున్నయ్
పొలగాల్ల కింత తిండిపెడుదామన్న
తిప్పలు చెప్పరాకుంటైతంది
పొలాల చెర్లు గండుపర్రెలు పెట్టి
ఒండు పట్టన పలిగి చేనంత గడుసువారింది
వాడిపోయిన చేను తాళ్లు పేనుకపోయి
రుంగజుట్టిన కర్రల చూసిన రైతుబెంగ
మాటరాకుండ నోరు బొంగు పోయింది

వచ్చిపోయెగాడుపులకి పొలం తటారిపోయింది
రైతుకు ఓదార్చేతందుకు మ్యాతమేయని ఆవుల్యాగలు
దొడ్డికాడ నెత్తికి సేతులుపెట్టిన రైతుసుట్టు కటారగట్టినై
కన్నతల్లిలాంటి ఆవుల్యాగలను కటికోల్లకు అమ్మాలంటే
పాణం కల కల అంటంది
మిత్తికి తెచ్చిన అప్పు రైతు కుతికె మీద గడికోసారి మెరుస్తుంది

పర్రెలు పెట్టిన పొలంల జారిపోయినకాలం
అడివైన అప్పులబతుకు పొగలెల్లుకుంట కనబడితే
బతుకుడే దినదిన పాణగండమైతంది

ఓట్లముందు తూట్లు బతుకుల మీద
హామిల వర్షం కురిసినపుడు
సర్కారు గద్దెనెక్కి మోచేయి చూపెడ్తదనుకోలే?
గాసం లేకుంట మోసం జేత్త దనుకోలే?

కొట్టంకాడ పరిగడుపున ఆవుపాలు ఉడుకు ఉడుకు తాగినట్లు
పురుగుమందు పరిగడుపున్నె తాగి ఒరిగిపోతండు
చేనును లూటీచేసే అడవిపందులకు ఉర్లుపెట్టినట్లు
బతుకు అడివైనందుకు ఉరివెట్టుకొని పాణం దీసుకుంటండు

పెద్దలమాట సద్దిమూట
ఎద్దు ఏడిసిన యెవుసం
రైతుసురు తలిగిన దేశం సర్వనాశనం

22-03-2005

కమ్మల గుడిసే

ముడికారంతోని చిప్పల బువ్వతిని
రకుతం సెమట బొట్టుగా రాల్సిన పనిల
అలసిన కష్టాన్ని ఆకలిబతుకుల్ని
నవుసుతూ మూలిగే నాదాలు
శాతగాని గునుపుల్ని నిలువెల్ల అలుముకొని
పేదోన్ని నిమ్మలం జేసే కన్నతల్లి

మనసుకు వద్ద తూట్లు
ఆకలిపేగుల అరుపుల తిప్పలు
గాలికి గడగడలాడే కమ్మల సప్పుడుతో
జోకొట్టె ఆత్మ గల్ల అవ్వ సేతులు గుడిసె కమ్మలు

ఎండకు ఎండినా వానలో తడిసిన గుండెనిండ
బండబారిన బతుకులకు
నిండుగా అతికిపోయే తాటికమ్మ
నువ్ గుడిసెకు అమ్మవు
లేవలేని బతుకులకు 'అర్క' గాకుండా
ఛిల్లులు పద్ద సంసారాలకు ఆధారమై
పుచ్చిపోయినా ఓపికగా ఉంటూ
బాధల్ని భరించాలని చెప్పె 'వాయిలి పొర్క'
నిజమైన గుణపాఠమెర్కచేసేది నువ్వే

షీకుటం పట్టిన తాటికమ్మలకు
తూట్లు పొడిచిన రాళ్లవానల
గాలికి కొట్టుకపోయిన సూరు
అవుతారం జూస్తే మోసమైన బతుకులకు

నిలువెత్తు సాక్ష్యం నువ్వే....
నకనకలాడుతున్న ఆకలి పేగులబాదల్ని
సింగం బింగం ఆడుతున్న ఎలుకలే ఎర్కజేస్తయ్

ఎండకు ఎండి వానకు తడిసిన
గుడిసెను మోసే గుంజలు బడుతలు
కన్నీళ్ల కష్టాలను ఇష్టంతో భరించి
సంసారంలో సాగాలని చెప్పే నిరీక్షణ

అన్ని కలగలసిన కమ్మల గుడిసె
మా కమ్మని 'గుడిసె'

23-03-2005

ఎగబాకె బతుకు

ఉట్టిల యాలాడుతున్న అంచెతట్టల
గుడ్లమీద పొదిగిన కోడి
తి(్రేసి మ(్రేసి గుడ్లను తింపుతున్నపుడు
తండ్లాట మూలుగులు యిన్నపుడు
నేను మాటలు నేర్సిన గావొచ్చు
మాట్లాడే మాటల్ల మనసంతా దేవుతది

పిల్లల్ని యెంటేసుకొని కోడి
యిత్తులు ఏరిపెడుతున్నపుడు
యెనుక చిక్కిన పిల్లకాళ్లకు
యెంటకలు సుట్టుకపోయి
అడుగడుగుకు సుడివడుతుంటె
నేను నడక నేర్సిన గావొచ్చు
నడిచే నడకల్ల
తిప్పల పోటురాయి తిరగబడుతుంది

ఆకిట్ల మాతాత
గూటం గుద్దుతూ చెప్పులు ముడవంగా
నొసటెంబటి గారిన సెమట జాలుని
ఎడమసేయి వాటమ్మిద ఎగజల్లినపుడు
తడసిన నేలను పొడిసిన నేను
మొనవోయిన ఆరెతో ఆడుతున్నపుడు
నేను అచ్చరాలు నేర్సినగావొచ్చు
రాసే కలం ఎపుడూ బాధల్నే రాలుప్తుంది

కాళ్లకు గజ్జెలు సంకలు దప్పు
చేతులకోల తీరొక్కదెబ్బ
నోసటితో పైసలు
కండ్లతో కడకు లోటు
అయ్య అందుకున్నపుడు
ఆట ఆడినగావొచ్చు
ఆడేటి ఆటల్ల పికురుంటలేదు

మెతుకుల్లేని అవ్వ పేగులు
తీగలుదెగిన రాగాలు దీసుకుంటు
వరికలుస్తున్నపుడు
కై గట్టుడు సురువు చేసిన గావొచ్చు
పేగులకు ఉరివెట్టిన అవ్వ
పేనినతాడు రుంగజుట్టుకపోయినట్లు
కైతలు రుంగజుడుతున్నెగందుకే గావొచ్చు

అయ్యవ్వ నెత్తురు
పనికి అత్తరద్దితే
అంగిలాగు తొడిగి
పలుక బలపం బట్టి
ఎగబాకే బతుకు ఎపుడు
బుద్దినేరుస్తనే ఉంటది
అంతరాల వ్యవస్థను
అంతం జేస్తది.

12-09-2005
11-00 రాత్రి

చితికిన ఆశలు

ఎండల పనిచేసే టొల్లను
ఎవలను చూసినా
దొక్క కట్టుకొని
రెక్కలిరిగేలా కష్టం జేసి
బతుకు దారపోస్తూ
కోటి కష్టాలు పడ్డాలు యాదికొస్తరు

మా అయ్య
ఎర్ర టెండల పనిచేస్తే
తడిబట్ట ఒడిపెట్టి తింపినట్టు
శమట పెయి నిండిపారేది

మా అవ్వ
రికాంలేని పనిల
తికానలేక తిప్పలు పడ్డకడుపు
పేనుక పోయిన వరికర్ర
ఒక్క దగ్గరికి వచ్చిన బొక్కెనముంత

పొద్దుమాపు యిరాంలేని పనిచేసి
పోసుగతాగ లేక ఉపాసముండి
ఉడుకు గంజిల ఉప్పురాయి యేసుకొని
ఊదుకుంట తాగినోళ్లు
యిగురంతోని ఒడికి పంపిన గురుతులు
మతిల మెరిస్తే
అందరి అయ్యవ్వల బాధ గుండెల్ల కెలుకుతది

బండెడు బొక్కలు పిండిచేసి
నెత్తురు నీళ్లు చేసి
కండ కరిగించిన కన్నవాళ్ల బోధ
ఆ తరువాతే
తరగతి గది టీచర్లు

ఎక్కిళ్లు పెట్టి ఏడిసినా
జోలపాటకు నోచుకోనోల్లం
పాలియ్యాలకు ఉడుకు పాలు తాగినోల్లం
ఉట్టిగెట్లుంటమ్
ఊపిరి ఉన్నంతవరకు
వారికోసం బతుకుదాం
చితికిన ఆశల్ని బతికించుకుందాం.

21-04-2006

మా‘దిగ బతుకు’

గూటం దెబ్బలు వాటం జూసినా
గూని దెబ్బలు తగులుతూనే ఉన్నై
కత్తి ఆరె కరకర నూరిన
కాట్లు పడుతనే ఉన్నై
చెప్పుల్ని చేసే చేతుల్ని చూసిన
శమట ఊరుతనే ఉంది

తప్పెక్కడ జరుగుతందని
చెయ్యని తప్పు
మతిల తిప్పల వెడుతంది

అన్నాయమెందుకు జరుగుతుందని
ఆలోచన కరివడి
ఆత్మల గాలి గత్తర లేపుతుంది

సాటింపు జేసిన దప్పుకోలకు
ఎగిరి దుంకిన గజ్జెలు
నొసటితో అద్దిన పైసలు
తంతెలు తెగిన తండ్లాట తెగుతలేదు

పాడెకట్టెలు కొట్టె గొడ్డలి
సచ్చిన గొదల్ని మోసే జివునాలు
పేనిన తాళ్లతో
తొండాలు పెయంత తానంబోత్తె
పంట పండినా నూకలు సాలుతలేవు
మాయితనం గోస తప్పుతలేదు

పొయిమీద ఎసరు పొంగిన
పోసుగతాగ లేదు
పక్కా ఇండ్ల పథకాలు
పొక్కలు పడ్డ గుడిసెలు తూట్లు మూస్తలేవు
పర్రెలు వెట్టిన గోడల సందుల్ని పూడుస్తలేవు

పథకాల పత్తాలేదు
ఉపాధిస్కీంల ఊసేలేదు
సదువు కొనుడు సందదైతే
నౌకర్లు నామ్‌కే వాస్తే
సర్కారు మారుతుంది సారం మారుతులేదు
పథకాల పేర్లు మారినా ఫలితాలు మారుతలేవు

మొండిదైన కత్తి
మొనబోయిన ఆరే
మోగని దప్పు
పాడైన మా‘దిగ బతుకు’
మంచిగయ్యేదెప్పుడో...

17-09-2006

కిర్రుచెప్ప

తంగేడు చెక్క లందగోళెంల మాగి
రోకలి మీద కత్తిగాట్లకు
నెత్తి కొరిగిచ్చుకున్న మురిగిన తోలు
ఎండకు ఎండి
అయ్యవ్వ నన్ను ముదుస్తరని మురిసిపోతది

పనితట్టతోని పని షురువైతే
అయ్యకు పనిరౌతు గురువైతది
గూటం దెబ్బల గుద్దులకు
తోలు ముద్దుగైతది

కత్తి మెత్తగ కోస్తే
తూటారే దారం అల్లితే
ఉంగుటం ముకువారు పొంగిపోతది

ఊరుతున్న శమట
చెప్పుకు అందెం అద్దుతే
అప్పుడు కిర్రుచెప్పులు కంటికి మజ్బూత్ అయితయి
దొరకాందానకు పటేలు తనానికి
పసందుగుంటయ్

చెప్పుల్ని చూచి చెంగలిస్తరు
అప్పుడు చేసినోని గురించి చెప్పుకోరు
ఎందుకంటె
ఊరికవతల మురికిగుంటల ఉండి
ముడిసినోడు ముడిసిన జాగల మురిగిపోతడు

నాయం మునాసం చూడని కిర్రుచెప్పు
అప్పుడపుడు
చెయ్యని తప్పుకు చెప్పు దెబ్బగొడ్తది

యెనకటి రామరాజ్యంల
చెప్పులు రాజరికం చేసినపుడు
శంభూకుని తల తెగిపడ్డది
నాటికీ నేటికి చెప్పులు చేసే జాతికి
తిప్పలు తప్పుతలేదు

26-12-2006

మాగుటికి మేం చేరుతం

మాదేవుండ్లు అన్ని
మేమేది తింటమో అవి తింటయ్
మేమేది తాగుతమో అవి తాగుతయ్
సప్పులు పీక్కతినేది యిడిసీ
నీ కొరకు సప్పటి కూడుకెగవడ్డం

వినాయకా! విఘ్నాయకా!
నీ పండుగని సూడసక్కంగా జేసుకుందామనుకుంటిమి
గరీబోల్లం ఉన్నంతల ఎల్లదీయానుకుంటిమి
దేవుడని నిలబెట్టినమో లేదో
మా బాధలు తెలిసెనా లేదా?
ఊరెల్ల దీయాలని జూలూస్ తిత్తన్నం

గంతే
నీకాళ్లు సెతులు యిరగ్గొట్టి
బొత్తల గుద్ది మెడల్ యిరిసి
ఏడికాడికి తుకుడల్ తుకుడల్ జేసిరి
నీ ఎలుకను పిల్లికొరికినట్లు మనువాదులు కొరికిరి
నీ మీద భక్తితో ఊకున్నం గని లేకుంటే
నిన్ను పలుగ కొట్టినోన్ని పగులగొట్టపోదుమా?
మా తెరువొస్తే.... ఊకుండం.

ఒకసారి కత్తి ఆరె పదునెక్కిందా
చర్మం కోస్తం నరాలుదీసి కార్జాలు పీకుతం
కార్జాలు ఎఱ్ఱగంటి నిపుకల మీద కాల్చి
దుబ్బులైన మా దుర్గమ్మకు కొలువంగా పసుపుబువ్వల నైద్యం బెడ్తం

ముడుసులు యిరిసి కీళ్లకు కీళ్లే నరుకుతం
మా ఇంటెన్క బొక్కల మండెల దాస్తం

మమ్ముల కొట్టెటోల్ల తున్కల్ తున్కల్‌జేసి
తస్సల్ని కోసి కాకులకు గద్దలకు ఏస్తం
మా బతుకులతో ఆడుకుంటే కొతవెడ్తం
కతం జేస్తం కాష్టం పేరుస్తం
సావంగ మిగిలిన కారకులను
పాణంతోటి గావు పట్టి పచ్చినెత్తురు తాగుతం
మా ఎల్లమ్మకు దండం బెడ్తం
మా యిండ్ల చుట్టూ సర్వగంప చల్లుతం
మా పండుగ జేసెతందుకు మాతొవ్వ మేం నడుస్తం
మా గూటికి మేం చేరుతం

(02-09-03న కర్నూల్ జిల్లా ప్యాపిలి గ్రామంలో వినాయక చతుర్థి రోజున ఊరేగింపుగా వెళుతున్న దళితుల గణపతి మీద దాడిచేసినందుకు స్పందించి)

06-09-2003

రంకు నేర్సిన బొంకు

నువ్వు పుట్టంగ ఒగ అవ్వ
మంత్రసాని అయి మాయిముంత దాసింది
యింకో అవ్వ నెత్తురు గుడ్డలు ఉతికింది
పెరుగంగ నూలుపోగు శ్రమ
బరివాతల ఉన్న నీకు బట్టకట్టింది
నడువంగ లంద గోలెంల మురిగినతోలు
పాదాలకు కిర్రుచెప్పులు జేసింది

తినెతందుకు తాగెతందుకు
కుమ్మరి సారె కుండలు జేసింది
వడ్లకమ్మరోల్ల పనితనం–పాలేరు శమట
పంట పండించింది నీరడితనం

సచ్చిన్నాడు
బొందపెట్టేది, కాడుపేర్సేది
సుట్టంలా పీనుగుకు పట్టంకట్టేది
సావుకు పెండ్లికి దుంకేది
దినాలకు యేషం ఏసి రాగం దీసేది
బ్యాగరి బైండ్ల దప్పు సిందోల్ల సిందులు

పండుగకు పబ్బానికి విందూ పసందు
మాంసాన్ని పెంచి యిచ్చెగొల్లతనం
అంతా డొల్లతనం
ఇదంత మరిసి
ఉన్నంతల బతికి ఊడిగెం జేసేటోల్లమని

మా కులాల మూలాల్ని
అవమానించే హక్కు మీకెక్కడిది....?

ఇంత మంది మనుషులు పనిజేస్తేనే
నువు మనిషోలే బతుకుతున్న వనే
మర్మాన్ని తెలుసుకొని మసులుకో

పైసలున్నయనే పైత్యముంటే
అల్లమ్మరబ్బ తింటె అరుగుతదిగని
పైసలుతింటె అరుగుతదా?
మనుషులు చేసే పని మనిషే చేయాలే
రూపాయలుంటే మనిషికి రూపమనుకునే నీకు
మానవత్వం లేకుంటే రూపాయికే రూపంలేదు
మనిషి ఒక లెక్కా!

ఇంత మంది ఇన్ని కులాలు
ఇగురుంతోటి అడుగులేస్తే
అడ్డంగాఉన్న ఇనుపగోడలు ఇచ్చుకపోవా
తూట్లు పడ్డ ఓట్లు ఒక్కటైతే
రాజ్యాధికారం బలహీనుల బతుకులకోసం ఒక్కటైతది
అపుడు రంకునెర్సిన బొంకు రాలిపోతది
ఆధారపడే బతుకు కాలిపోతది

09-03-2007

బట్టిపొయి

చెర్ల బర్లతోలి బర్రెకొమ్ములకు బ్యారం జేసే
బద్దుమాసులంగాదు
చెర్లచాపలకు ఈతనేర్పుతమనే
రోతమనుసులంగాదు
సెరువోలే పరువు మనుసులం

సెర్ల బట్టి పొయి పెట్టి బట్టలుతికినం
సాకలిపొయిల కంపుబట్టలు
కమ్మగ వాసనొచ్చెటట్లుతికినం

చూస్తనే ఒకారమొచ్చె ముట్టుబట్టలు
ముద్దుగ ఉతికినం
ఎక్కువోల్ల పిల్లకు తానంబోసి ఏదుకుంటిమి
పటేలు కొడుకు పుట్టంగనే
నెత్తురు కొసుమైల వాసనకు నెత్తిపట్టుకుంట
పొద్దంత పొత్తి బట్టలుతికినందుకు
పటేలు సెప్పిన పైస కల్లుకు
చేసిన పని అంతా మరిసి సెంగలిస్తిమి

కాపోల్ల పటేలు కాలముడిగి పానమిడిస్తే
పీనుగ ముందటి బూడిద సాట్ల ఎత్తుకొని
సావు బట్టలుతికి సందమయేదాక ఉంటమి
దినాలకు మా మొగొల్లు
పొద్దుగాల యాటలకోసి
పిట్ట ముట్టంగనే సుట్టి బట్టలుతుకుతరు
పటేలవ్వ గాజులు రేవుమీద పలగ్గొట్టి
ఏడుసుకొంటనే ధైర్నం చెబుతూ
ముండగాజులు ఎక్కిస్తరు మా ఆడోళ్లు

పొద్దంత పనిచేసి పొద్దుగుంజాముల
బుక్కెడు బువ్వకొరకు ఆకిట్ల నిలబడి
సాకల్దాన్నవ్వా... అంటే..
సలిబువ్వ సలిపులుసు పోసినపుడు సపుడుజెయ్యలే
పాసిబువ్వ, పాసిపులుసు తిని పరేషన్లబడ్డం
బువ్వను ఇగ అడుక్కోం
చేసిన పనికి పైకమియ్యిమంటం

తడిబట్ట పిండితే నీళ్లు కారినట్లు
మా శమట కారుతది
మా కడుపు మాడగొడితే పని ఎక్కడైతది

మమ్ముల కొట్టాలనుకునేటోల్లా జాగర్త
ఇంటిగుట్టు సాకల్దాని కెరుక
సాకలి పొయిల సొడుబోసి
బట్టలుడికిచ్చినట్లు మీ బతుకులను ఉడికిత్తం
సుయ్ అసుయ్ అనుకుంట బండకుకొడతం
గట్టిగ పికుల పిండుతం
ఎండల ఎండేస్తం నీడల ఆరెస్తం
మా పని చేసుకంట మేముంటం.

15-03-2007

మందబలం

అడ్డం కట్టిన బుడ్డగోసి
చేతుల గొడ్డలి సిప్ప రాతెండి టిపిని
నేతరుమాలు నెత్తికి సుట్టుకొని
దండెకడాలు యెండిపోగుల పోంచి
మాదిగి సెప్పులు మట్టగ తొడుక్కొని
చెట్టల్ల గుట్టల్ల మన్యం తిరుగుతూ
కొమ్మగొట్టి అడివిల ఆకులలములుకోసి
మందను మేపే మా గొల్లబతుకు
కొనాఖరికి తెలివిలేని గొర్ల తీరుగ అయింది

ఆ సామి పిలుపు తిట్లతోనె
తొవ్వొంటి మందపోతే నిందపెడ్తడు
అనుకోకుండా చేన్లపడితే
పోరగండ్లను గుంజికొడుతరు
గొడ్డళ్లు గొంగళ్లు గుంజుకపోతరు
అలల్లా అనంగ గండకరువుల
పంచాది పెట్టి పయమాలు తీత్తరు

ఊరుఊరంత జరుపుకునే 'దసుర'కు
పుణ్యానికి యిచ్చిన యాటపిల్లను
లోకమంత సూడంగా తలువారుతో తలనరుకుతరు
నెత్తురు బొట్టు నొసటికి పెట్టుకుంటరు
దసర బొట్టని ఇంటింటికి పంచుతరు

పొద్దంత తిరిగి తిరిగి పొద్దుగూకి మందపెట్టి
తెల్లారేదాక తెలివితో మందకాయాలే
శివరాతిరి జాగారం యాటొక్కసారె
చెవులుకోసిన మందకుక్కతోటి
బతికినన్ని రోజులు జాగారమే
మందను కరాబుచేసే తోడేళ్లను నక్కలను
కట్టెతోని తరుముతుంటే
మందబలం చూసుకొని కుక్క
మీది మీదికి ఉరుకుతది.

గొర్లుమేపిన తెలివితోని
బూరు కొరిగి ఉన్నిదారం పేని గొంగడి అల్లుకున్నం
ఎండకు వానకు గొంగడితోనే దోస్తాన
వరదలు పారిన మూడుగుండ్రాళ్ల మీద పండుకొని కావలి కాయాలె
వానకు పులుసు పులుసైన దొడ్డి గెదర్‌వాసన కొత్తది
గా గెదర్ వాసనతోనె " గొల్లోనికేం ఎరుక మల్లెపువ్వాసన" మాట
మాబతుకు గెదరు కొడితే మా పని కంపుకొడ్తది
ఎవలేమనుకున్న మాది మాకు ఇంపే

మాకు మల్లెపువ్వాసన తెలువాలంటే
మా ఓట్లు మాకురాలిన్నాడు
మా గొడ్డలి చిప్పలు మాకోసం నరుకుడు సురువుజేసిన్నాడు
మా మంద మాకు యిందులు యిచ్చిన్నాడు
గొర్లకోసం కొమ్మ గొట్టినగొడ్డండ్లు
పాడైన మా బతుకుల కోసం కొట్టిన్నాడు
మా బతుకుల్ బాగయితయ్

26-03-2003
10-45ని॥

కొలిమి

ఊపిరి తిత్తులు గాలి ఊదితే
కొలిమి మండటానికి
నిలువెల్ల తడిసిన శమటలో
సుత్తె సానం, సమ్మెట పట్టుకారు ఒకటై
కాకమీద కొడితే ఎట్లగావాలనుకుంటె గట్లైతది

ఆకిట్ల ఆసాముల ముచ్చట్లతోని
వడ్లబాడిసె చెక్కుతున్న శమటజల్లు
కిందపడి పొక్కిలైన ఆకిలిని తడిపేది
పంట పండినంక ఆసాములు
అవ్వలా పిలిచి బువ్వ పెట్టేవాళ్లు

బిందెల్ చేసె బతుకు
తూట్లు మూసి నీళ్లు కారకుంట జెసినా
కలాయి పోసెబతుకు కల్లోలమైంది

బండరాయిని సుత్తెదెబ్బలతో
ఒత్తి ఒత్తి కొడితే తలుచుకున్న రూపం ధరిస్తది
దేవుని రూపమని జనం మొక్కుతది
సర్కారును జనం మొక్కితే
చేసిన సేతులను నరికె తందుకు
బహుళ జాతి కంపెనీలకు బాటలెయ్యవట్టె
శిలలు శిల్పాలు అందాలైతే
చేసినోల్ల యిండ్లు చెదిరిపోతున్నై
భుజకిరిటాల పాలించె రాజ్యంల

కమ్మలు బుట్టాలు గుండ్లు ఎనెలు జెసే బతుకు రంది లెకుంటుండె
ఇపుడు అద్దాల పెట్టెలల్ల మెరిసిపోతూంటె
గొట్టం పట్టి ఊదుతున్న అవుసుల బతుకు
మిషిన్ల పనితనమ్ముందట మింగమెతుకు లేకుంటైతంది

బతుకులు చెడగొట్టినోళ్ళను
కమ్మరి కొలిమి కాలపెట్టి సరుస్తది
ప్రపంచమార్కెట్‌ను బాడిసెనే చెక్కుతది
'కొలిమి' రగ రగ మండుతది.

25-05-2007

మస్కూర్లు

ఏయ్....... అనంగనే
ఒక్క దగ్గరికి ముడుసుకొని
పబ్బతి పట్టి నిలబడి చెప్పినట్టు యింటన్నం
ఉరుకు.... అంటె
ఎగపోసుకుంట ఉరుకుతున్నం

మాదిగి దప్పుతోటి కీకలేసి
ఊరంత సాటింపు చేయ్యాలె
కరాబైన బోరింగుల్ని మంచిగ సెయ్యాలె
సచ్చిన కుక్కల కంపుని ఊరవతలకి గుంజుకపోవాలె
సావుకాడ జరలేకపోతే మస్తు తిడ్తరుగని
సంపతికాడ మమ్ముల ఎవలు చూస్తరు

ముసలి కరణాలకు, సర్పంచ్‌లకు, కారోబార్లకు
పటేండ్లకు దొరలకు ఇంటికాడ కావలి కూసుంటం
కట్టెలు కొడుతం కోడిని కోత్తం
దయగల్ల అవ్వ పిలిచి పెడితే
ఆకిట్ల తింటం
లేకపోతే తినెపోరగాండ్లకు తీసుకపోతం

ఊల్లెకు ఏ అతికారి వచ్చినా
సుట్టపోనికి చేసే మర్యాద చేస్తం
జేబుకు బిల్ల చేతుల బరిసెతో
ఊరు ఊరంత తిరుగుతం
ఇత్తారేసి తిండి పెడ్తం
తినెటపుడు మస్కూరి అని పిలువంది
గొంతెకల బుక్క కడుపులకు జారది

ఐదేండ్లకు ఒచ్చే ఓట్లకు
తినేటోడు తింటడు తాగెటోడు తాగుతడు
తినంగ మిగులుతనే సేతుల పెడుతరు
మంత్రులు ఎమ్మేల్యేలు, ముఖ్యమంత్రులు మారుతంద్రు
మాతలరాత మారుస్తలేరు.

తిట్టినా తిప్పలు పెట్టినా పడ్డం
తిండి పెట్టక పోయినా ఓర్సుకున్నం
పొద్దంత తెల్లందాక కావలిగాసినం
పొట్టకు సాలని జీతంతో బతుకుమంటె
ఎట్ల బతుకుతం

ఊరు గురించి బజార్ల నడిసినం
ఇపుడు మా గురించి నడుస్తన్నం
పనిసెయ్యాలని అంగిడిసినం
ఇపుడు కడుపు నిండుతలేదని అంగిడుస్తున్నం

(గ్రామ సేవకుల ధర్నాకు మద్దతుతో...)

01-04-2007

పయిలం

"పోతున్నవ్ గని పయిలం పొయినకాడ మంచిగుండు
నీదేందో నువ్ జదువుకో లేకపోతే నీ బతుకే నవ్వట్ల బతుకు
ఎవ్వని తెరువువోకు ఎవడేమన్నంటే నన్ను గాదనుకో
బజాట్ల కుక్కలు మస్తుగ మొరుగుతయ్ అన్నిటిని కొడుతమా?
బతికినన్ని రోజులు మంచిగ బతుకాలి"

నాయిన బోధ

"బిడ్డా! యాల్లకు దిను, తిండి కాడ సిగ్గుపడకు
కండ్లు పెద్దగ జేసి కడుపు సిన్నగ జేసుకో
పోయినంక పోచయ్య సారు యింటికి ఫోను చెయ్యి"

అవ్వబాధ

"ముగ్గురున్న కాడ ముచ్చట వెట్టకు నలుగురున్నకాడ నవ్వకు
ఒగొల్లు తాగిపిస్తే తాగకు తినిపిస్తె తినకు
అయ్యకు పని ఆసర అవుతవేమో అనుకుంటే పట్నం పోవడితివి
పోతె పోతివిగని ఓ నౌకరి దొరికిచ్చుకో
పయిలం బిడ్డా మంచిగ సదువు"

నాయినమ్మ

"ఉట్టిగనే సెప్పుతలేను జరుగవోయేదే సెప్పుతున్న మంచిగ యిను
ఆడోల్ల జోలికివోకు మెడకు ఉరి వెద్తరు
ఎఱ్రగ బుఱ్రగ వున్నవని ఎదురొస్తరు నమ్మకు నమ్మకు
ఈ సదువు కాంగనే నాలుగిత్తు లేస్తగని నమ్మకు
ఒగొనికి చెయి చాపక బతుకు
బసులు కార్లు పట్నంల బాగుంటయట రాంగపోంగ పయిలం
పోయినట్లు గాదు పలానోని మనుమడివని పేరుదేవోయ్"

తాత

నా గురించి ఏమి ఫికర్ చేయ్యద్దు నేను మంచిగనే ఉంట
అవ్వా! నా కడుపు గురించి రంది పెట్టుకోకు, నా గురించి ఏడ్వకు
నాయిన! మంచిగ సదివి బతికినన్ని రోజులు నీకు పేరు దెస్త
అమ్మా! ఒగరికి ఆసపడిన బతుకు బతుకనే...
ఒగరు నాకాసపడెటట్లు బతుకుతనే
తాత! నువుజెప్పినట్లు నేనున్నన్ని రోజులు నీకు మంచిపేరుదెస్తా.....,
ఇగవోతున్న... ఇంటికాడ పయిలం అందరు పయిలం.

08-06-2003

(ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితం.)

ఎద్దూ - మనిషి

వృత్తుల్ని కులాలుగా విభజించి
వృత్తిధర్మం జెప్పింది వాడే
తీరాకులవృత్తి చేస్తుంటె కత్తికోతకోసింది వాడే

పచ్చకామెర్ల రోగికి లోకమంత పచ్చగున్నట్లు
కాషాయముతో ఎరుపెక్కిన కండ్లకు
లోకమంత కాషాయ వర్ణమెకనబడుతుంది
కోయడమే వాడి తత్వమైనపుడు
వాడికి ముస్లింలైతేనేం దళితులైతేనేం

వాడు మనిషికాదు ఎందుకంటె
ఆవు నీ తల్లైనపుడు
ఆ తల్లి పాలివ్వడం మానినపుడు
కోసుక తినే వాడికెందుకు అమ్మడం
తీనాలని కోస్తున్న వాడిని కోయడమెందుకు

వానితల్లి ఆవు
వాడి తండ్రి ఎద్దు
వాడు మాత్రం మనిషి

ఒరేయ్
పశువును కోసే మనిషి లక్షణాలున్నాయిగాని
నీలా మనిషిని కోసే విష లక్షణాలు లేవు మాకు

ఓరి, బుద్ధిమాషి
మా పనితనం ఎర్కేనా?
కత్తులు నూరుతం ఆరెలుపడుతం పూలుగుదీత్తం
తస్సల్ని కోత్తం నరాలు వొలుస్తం కార్జాలు గుంజుతం
మాంసాన్ని తునకల్ తునకల్ జేసి కాకులకు గద్దలకేత్తం
ఉడుకు ఉడుకు నెత్తురు ఉడికిచ్చి తింటం
మాకు అడ్డమొస్తె మేం జేసేది గంతే....,

(హర్యానా 2002 అక్టోబర్ 15 విజయదశిమి రోజున హర్యానలోని జజ్జర్‌లో హిందుత్వవాదులు 5గురు చర్మకారులను ఊచకొత కొసినందుకు)

జాగర్త

మమ్ముల
ఎట్టి మాదిగోల్లు
ఎడ్డి మాదిగోల్లని ఏల్యేం చెయ్యకు
మా గూటం కూడా ఎడ్డిదే
కాని
వాటం జూసి ఒక్కసారి గుద్దిందా
బతుకు బద్దలైతది

04-2007